క్లుప్తంగా

పెన్షన్ డబ్బులు రాలే



మంగళి జెగ్గమ్మ

జోగిపేట(అందోల్): 26వ తేదీ వచ్చినా పెన్షన్ డబ్బులు తన ఖాతాలో పడలేదని, పెన్షన్ కోసం ప్రతీరోజు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందని మహిళ మంగళి జెగ్గమ్మ విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. తనది అందోల్ గ్రామమని, తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎవరూ లేరని దినం గడవడమే కష్టంగా ఉందని వాపోయింది. తనకు ప్రభుత్వం రూ.3 వేలు పెన్షను మంజూరు చేసిందని, అయితే ఏ తేదీన బ్యాంకులో జమవుతుందో తెలయడంలేదని చెప్పింది. పెన్షన్ కోసం అందోల్ నుంచి జోగిపేటకు వచ్చేందుకు రూ.30 చార్జీతో ఆటోలో వస్తున్నానని తెలిపింది. ఫలానా తేదీన బ్యాంక్‌లో జమవుతుందని తెలిస్తే తనకు కష్టం తప్పుందని తెలిపింది. శుక్రవారం కూడా రాలేదని బ్యాంక్ సిబ్బంది తెలిపారని, ఎప్పుడు పడతాయో వాళ్లు చెప్పలేని చెప్పింది.

ఉత్సవాలకు ఆహ్వానం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడలో జూన్ 3నుంచి 7వ తేదీ వరకు నవగ్రహ, బొడ్రాయి, లింగమయ్య, ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలునిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని యాదవం సంఘం నాయకులు కోరారు. ఉత్సవాల కరపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఉపసర్పంచ్ సంజీవ, నాయకులు శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



క్యాంపును ప్రారంభిస్తున్న కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ సూచించారు. గుమ్మడిదలలో ఉచితంగా టీబీ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపును ఓ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులతో సంగారెడ్డి అభివృద్ధి



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: 20 ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలు సీఎం ప్రత్యేక నిధులతో పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 27 వార్డులో రూ.30 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో దీర్ఘకాలిక సమస్యలు, ప్రజలు ఎంచుకున్న పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నక్క మంజులత నాగరాజ్ గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

హత్నూర (సంగారెడ్డి): రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిన్నారం సీఐ వేణు కుమార్ అన్నారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. రైతులను మోసం చేసే విధంగా కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత రసీదు తీసుకోవాలని సూచించారు. తనిఖీలలో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి, ఏఈఓ ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే గెలుపు మంత్రం

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఎంపీ బీబీ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారమే మన గెలుపు సూత్రమని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం వట్‌పల్లిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలిచే ప్రభుత్వమన్నారు. సంక్షేమంలో కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా క్రాంతికిరణ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర నాయకుడు భిక్షపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు సురేఖ, ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి, ఎంపీటీసీ ఇందిరాబాయి, సర్పంచ్‌లు ఖయ్యూం, దీప్లానాయక్, నవనీత, వరము చైర్మన్ వీరారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, రైతుబంధు మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధి రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మున్సిపాలిటీల పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి 14వ వార్డు గ్రీన్ మెడోస్ కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.1.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ఏటా కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.25 కోట్లతో ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, కౌన్సిలర్ కవిత శ్రీనివాస్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, డీసీఎంఎస్ చైర్మన్

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మానిక్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, నాయకులతో కలిసి రూ.88లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరటంతో ఈదులపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ తన సొంత వ్యవసాయ పొలం నుంచి రూ.55లక్షల విలువ చేసే 24 గుంటల భూమిని పాఠశాల నిర్మాణానికి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణానికి స్థలం విరాళంగా ఇవ్వటం చాలా సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాచయ్య, స్వామి, సర్పంచ్ బస్వరాజ్ పాటిల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని వడ్డేపల్లి పరిధిలో తురకల ఖానాపూర్ శివారులో సురభి కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం పరిసర గ్రామాల ప్రజలు తహసీల్దార్‌కు వినతి పత్రం అంజేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి సర్పంచ్ స్వరూప, కోణంపేట సర్పంచ్ శివారెడ్డి, చింతల చెరువు ఎంపీటీసీ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ శశికళ, సాదుల్ నగర్ మాజీ సర్పంచ్ కృష్ణ, తురకలకనాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ పేరుకు గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అయినప్పటికీ కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులకు అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. కార్మికులకు ఐదు నెలలుగా ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం దుర్మార్గమన్నారు. అధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరువధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం చేస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి సమస్యలు లేకుండా చర్యలు



పిప్రిలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఇబ్బందులు కలుగకుండా అవసరాల మేరకు ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పిప్రి గ్రామంలో రూ.22.85 లక్షల వ్యయంతో ట్యాంకు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చాందీబాయి చౌహాన్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, ఎంపీటీసీ నారాయణనాయక్, రమేశ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. నిజాంపేట మండలం ర్యాలమడుగుకు చెందిన కేతావత్ విష్ణురాథోడ్ అండర్ 19 విభాగంలో జిల్లాస్థాయి క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందున క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సన్మానించారు. సిర్గాపూర్ మండలం పోచాపూర్‌కు చెందిన కళావతికి మంజూరైన రూ.28 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలి

● సీఐ భూపతి

జహీరాబాద్ టౌన్: విద్యార్థులు చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలని సీఐ భూపతి అన్నారు. పట్టణంలోని వాసవి కల్యాణ మంటపంలో వశిష్ట డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ.. చదువుల్లో విపరీతమైన పోటీ ఉందని, అందుకు తగ్గట్టుగా కష్టపడి చదివి రాణించాలన్నారు. చదువులతో పాటు ఆటపాటలపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిద్దారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మారుతిరావు, కళాశాల వైస్ ప్రెసిడెంట్ షీలా, డైరెక్టర్లు అమర్‌నాథ్, సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): మండలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మనూరులోని రూ.5 లక్షలతో ఎస్సీ కమ్యునిటీ భవనం, రూ. 34.88 లక్షలతో వాటర్ ట్యాంకు, రాణాపూర్‌లోని రూ.29.59 లక్షలతో నీటి ట్యాంకు, ఉసిరికెపల్లికి రూ.20.91 లక్షలు మంజూరు పనులకు భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ గ్రామాల్లో ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. సీఎం ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్‌రావు, సర్పంచ్ శివాజీరావు, ఈఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఫణివర్మ, నాగేందర్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

● కేసు నమోదు చేసిన పోలీసులు

మర్పల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన ఇస్మాల్‌బీ, మహ్మద్ షరీఫ్ ఖాన్ దంపతుల కూతురు నాహీదాబీని మర్పల్లికి చెందిన మహ్మద్ అక్రమ్‌కు ఇచ్చి 2019లో వివాహం చేశారు. కొంతకాలం బాగానే ఉన్నా అదనపు కట్నం కోసం తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య గొడవ పడి జహీరాబాద్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. పెద్దల సమక్షంలో రాజీకుదిర్చి భర్త అక్రమ్ వద్దకు పంపారు. మళ్లీ ఘర్షణ జరగడంతో ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. విషయం తెలియంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి మహ్మద్ షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అదనపు కట్నం కోసం కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయన్నారు. అత్తింటే వారే తన కూతురును హత్య చేశారంటూ ఆరోపించారు. అనుమానం రాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల మేరకు దుకాణాలను నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏఓ అభినాష్ వర్మ

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ నిబంధనల మేరకు ఫర్టిలైజర్ దుకాణాలను నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ డీలర్లను ఆదేశించారు. రాయికోడ్‌లోని రైతువేదికలో శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల ధరల బోర్డులు రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. స్టాక్‌బోర్డులు, విక్రయించిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రిజిస్టర్లను విధిగా నమోదు చేయాలన్నారు. గడువు ముగిసిన లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ యాదయ్య, ఆయా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సైబర్ నేరాలపై అవగాహన**

రాయికోడ్(అందోల్): మండలంలోని చిమ్నాపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఏడుకొండలు మాట్లాడుతూ అపరిచితులకు వ్యక్తిగత వివరాలు తెలపొద్దన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఫిర్యాదు చేస్తే రికవరీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు.

◆ **స్వయం ఉపాధితో ఉన్నత స్థాయికి ఎదగాలి**

పటాన్‌చెరు టౌన్: యువత స్వయం ఉపాధితో ఉన్నత స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణం ఎంజీ రోడ్డు లో ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు స్వయంగా ఉపాధి ఎంచుకొని ఉన్నత స్థాయికి చేరి పదిమందికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **లలితకు నివాళి**

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను అర్పించిన గాన కోకిల బెల్లి లలితకు 24వ వర్థంతి సందర్భంగా బీఎస్పీ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిద్దు రావణ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో బెల్లి లలితక్క తన పాటల ద్వారా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. బహుజన రాజ్యం కోసం ఆమె తన ప్రాణాలను త్యాగం చేసిందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాబురావు, యాదగిరి, మోజెస్, రాజు, రవి,సంతోష్, జాన్, రవీందర్, అభిషేక్, కరీంలు పాల్గొన్నారు.

◆ **బస్తీ దర్శన్**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీ శుక్రవారం బస్తీ దర్శన్ నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నెంబర్2లో డ్రైనేజీ సమస్య ఉందని చెప్పారు. కాలనీవాసులు తనదృష్టికి తీసుకొచ్చిన సమస్యను త్వరలో పరిష్కారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, రాజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లేష్‌లు పాల్గొన్నారు.

◆ **ప్రారంభమైన ఖరీఫ్ పనులు**

మునిపల్లి(అందోల్): ఖరీఫ్‌లో పత్తి విత్తనాలు నాటేందు ముందస్తుగా పత్తి గీతల కార్యక్రమాన్ని రైతులు ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి, పిల్లోడి గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటేందుకు ట్రాక్టర్‌తో పత్తి సాలు తీశారు. జూన్ 8వ తేదీన మృగశిర కార్తె ఉన్నా తరచు వర్షాలు కురుస్తుండటంతో పత్తి విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టారు.

◆ **ఎంసెట్‌లో విద్యార్థుల ప్రతిభ**

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో జహీరాబాద్ మైనార్టీ గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎస్ఏ. జమీల్ తెలిపారు. అగ్రికల్చర్ మెడికల్ విభాగంలో గురుకులం విద్యార్థులు ఎండీ తబ్రేజ్‌కు 4507 ర్యాంక్, ఎండీ. ఖాజా అవేస్‌ఖాన్‌కు 4878వ ర్యాంక్, ముజాంబిల్ హసేన్‌కు 5682వ ర్యాంక్, ఎండీ. ఫర్హాన్‌కు 9120 ర్యాంక్ వచ్చిందన్నారు. గురుకులంలోని మరో 50 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 15 మందికి మంచి ర్యాంకులు వచ్చాయన్నారు. ఎంసెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మైనార్టీ గురుకుల కోఆర్డినేటర్ నిర్సం, కార్యదర్శి షఫీఉల్లాలు అభినందించారు.

◆ **మేరీ లైఫ్–మేరీ స్వచ్ఛ షెహర్‌తో..**

పటాన్‌చెరు టౌన్: మేరీ లైఫ్ – మేరీ స్వచ్ఛ షెహర్ కార్యక్రమంతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే మేరీ లైఫ్ – మేరీ స్వచ్ షెహర్ పేరుతో ఈనెల 18 నుంచి వచ్చే జూన్ 5వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

జనుము విత్తనాల పంపిణీ

మునిపల్లి(అందోల్): ఈనెల 27వ తేదీన రైతు వెదికలో రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి శివకుమార్ శుక్రవారం తెలిపారు. 40 కేజీల బస్తా రూ.1,230 చొప్పున సబ్సిడీపై అందజేస్తామన్నారు. జనుము విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీదత్తాత్రేయ దేవాలయంలో ఈనెల 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీదత్తాత్రేయస్వామి, రేణుకామాత, నవగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న రాజేశ్వరరావు దేశ్‌పాండే

సంగారెడ్డి టౌన్: బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ సంగారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జ్, కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావు దేశ్‌పాండే పిలుపునిచ్చారు. శుక్రవారం సంగారెడ్డి మండలం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పాపయ్య, సీనియర్ నాయకులు వేణుమాధవ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



నారాయణఖేడ్: మురుగు కాల్వల్లోని పూడికను తొలగిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ శుక్రవారం ముమ్మరంగా కొనసాగింది. పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోని మురుగు తొలగించడమే కాకుండా మరికొన్నిచోట్ల పూడిక తీత పనులు చేపట్టారు. మురుగు తొలగించిన కాల్వల్లో బ్లీచింగ్ చల్లారు. పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

జోగిపేట(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులో శుక్రవారం పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖా ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కమిషనర్ తిరుపతి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది నారాయణ, రవీందర్ వార్డు నాయకుడు చిట్యాల మధు, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు నైతిక విలువల పెంపు కోసం

సంగారెడ్డి టౌన్: వేసవి వికాసం పేరుతో వేసవి శిబిరాన్ని సంగారెడ్డి మండలం ఫసల్వాది శివారులోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో వ్యవస్థాపకుడు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 29వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువ పెంచడానికి, ఉలాసంగా ఉండటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 300 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారన్నారు.